క్లుప్తంగా

ఎమ్మెల్సీని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఎమ్మెల్సీ వెంకట్‌తో మాట్లాడుతున్న నాయకులు

జమ్మికుంట: పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శనివారం ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా జమ్మికుంట మున్సిపల్‌లోని 30 వార్డుల్లో అభివృద్ధి పనులకు నిధుల మంజురుకు కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ సానుకులంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. కసుబోజుల వెంకన్న, ఎండీ సలీం, ఎగ్గని శ్రీనివాస్, నాగేంద్రం తదితరులు ఉన్నారు.

డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

శంకరపట్నం: ఆర్థిక, సామాజిక, కులగణన సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని పీఆర్‌టీయూ నాయకులు ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందించారు. సెలవు రోజుల్లో సర్వే చేశామని, సీసీఎల్ పొందే అవకాశం ఉన్నందున డ్యూటీ సర్టిఫికెట్ అందించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకట్రామ్‌రెడ్డి కోరారు. మండల అధ్యక్షుడు కల్లెం మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు, లక్ష్మీనారాయణ, లింగారెడ్డి పాల్గొన్నారు.

'ఉద్యోగులను తొలగిస్తామనడం సరికాదు'



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

హుజూరాబాద్: నిరవధిక సమ్మెలో ఉన్న ఎస్ఎస్ఏ, కేజీబీవీ ఉద్యోగుల సమస్యలు పరిష్కంచకుండా వారిని తొలగిస్తామనడం సరికాదని డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ పల్కల ఈశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో 2025 సంవత్సర డీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. తక్కువ వేతనంతో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలు, బిల్లులు విడుదల చేయాలన్నారు. హెచ్ఎం బి.తిరుమల, ఎస్.చక్రధర్, అల్లి శ్రీనివాస్, కె.వెంకట్‌స్వామి, సదానందం, తిరుపతిరెడ్డి, మల్లేశం, శంకర్, సత్యరాజ్, ప్రవీణ్, ఆంజనేయులు, రాజేశ్, సరళ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో సైనిక్ స్కూల్ విద్యార్థి ప్రతిభ



నరేశ్

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారులోగల సాంఘీక సంక్షేమ గురుకుల సైనిక పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభచాటాడు. హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో జరుగుతున్న సీఎం కప్ బాక్సింగ్ పోటీల్లో 46–48 కిలోల విభాగంలో కె.నరేశ్ పాల్గొని కాంస్య పతకం సాధించాడు. విద్యార్థితో పాటు బాక్సింగ్ కోచ్ శ్రీకాంత్‌ను పాఠశాల డైరెక్టర్ కేసీ రావు, ప్రిన్సిపాల్ కాళహస్తి అభినందించారు.

సోషల్ ప్రతిభ పరీక్షలో..



సర్టిఫికెట్ అందుకుంటున్న రిషిక

మానకొండూర్: జిల్లా స్థాయి సోషల్ ప్రతిభ పరీక్షలో మానకొండూర్ మండలం పోచంపల్లి మోడల్ స్కూల్ విద్యార్థిని ఎ.రిషిక ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. విద్యార్థిని ఎంఈవో మధుసూదనాచారి, ప్రిన్సిపాల్ పద్మశ్రీ ఉపాధ్యాయులు అభినందించారు.

నీరు విడుదల చేయండి

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో ఎస్సారెస్పీ ప్రధాన కాలువ ఎస్కేప్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయాలని శనివారం తహసీల్దార్ భాస్కర్‌కు మాజీ సర్పంచ్‌లు, రైతులు వినతిపత్రం అందించారు. వరినార్లు ముదురుతున్నందున ఎస్కేప్‌గేట్ల ద్వారా కేశవపట్నం చెరువు, ముత్తారం చెరువు, అర్కండ్ల వాగు, కల్వల ప్రాజెక్ట్‌కు నీరు చేరి యాసంగిలో రైతులు నాట్లు వేసుకుంటారని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో దాసారపు భద్రయ్య, కొండ్ర రాజయ్య, వెంకటరమణారెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తాగునీరు.. పట్టించుకోరు..

మండల కేంద్రంలోని 1, 10వ వార్డుల్లో ప్రధాన పైప్‌లైన్ పగిలి తాగునీరు వృథాగా పోతోంది. నీరు కలుషితమవుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. మూడేళ్లుగా ఈ సమస్య ఉందని, పలుమార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. చిన్నకోమటిపల్లి గ్రామానికి వెళ్లే రహదారి కావడంతో వాహనదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు.

– ఇల్లందకుంట



ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్



పాలకవర్గం ప్రమాణస్వీకారంలో ప్రణవ్

హుజూరాబాద్: నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శనివారం పట్టణంలోని హనుమాన్ ఆలయంలో నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, నాయకులు ఘనస్వాగతం పలికారు. చైర్మన్‌గా కొలిపాక శంకర్, డైరెక్టర్లుగా పున్నం చందర్, ప్రతాప నాగరాజు, బుసారపు శంకర్, మాచర్ల నరేశ్, ఎర్ర మధులత, గాలిబ్ రాజేందర్‌లతో ఆలయ ఈవో సుధాకర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో ప్రధాన ఆలయాల అభివృద్ధి అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, వేములవాడ ఆలయం వలె ఇల్లందకుంట ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హనుమాన్ ఆలయ పాలకవర్గం కొలువుదీరిందని, ఈ ఆలయానికి సంబంధించి కొన్ని సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చారని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, నాయకులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ టీచర్‌కు సావిత్రీబాయి పూలే అవార్డు



శ్రీనివాస్

గంగాధర: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కవి, రచయిత, చిత్రకారుడు మియాపూరం శ్రీనివాస్‌ను అవార్డు వవరించింది. వెస్ట్‌బెంగాల్ రాష్ట్రానికి చెందిన వెల్‌రెడ్ ఫౌండేషన్‌వారు 2025వ సంవత్సరానికిగాను సావిత్రీబాయి పూలే లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు అందజేశారు. సాహిత్య కళాసేవా కార్యక్రమాలను గుర్తించి ఆన్‌లైన్ ద్వారా అవార్డు అందజేసినట్లు శ్రీనివాస్ పేర్కొన్నాడు.

ఉపాధ్యాయుల పక్షాన పోరాడుతా



నాగయ్యకు పుష్పగుచ్ఛం ఇస్తున్న అధ్యాపకులు

హుజూరాబాద్: నిరుద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే అహర్నిషలు పోరాడుతానని పోకల నాగయ్య కోరారు. శనివారం పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులను సందర్శించారు. ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యలపై మేనిఫెస్టో రూపొందించి విడుదల చేస్తానని తెలిపారు. టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజేశ్‌యాదవ్, పత్తి రాజిరెడ్డి, వేణుమాధవ్, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజు, స్వాతి, జగన్, ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ బాధ్యుల నియామకం



ఉత్తర్వులు అందజేస్తున్న సంజయ్‌కుమార్

హుజూరాబాద్: బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పట్టణానికి చెందిన ఇప్పకాయల సాగర్, రాష్ట్ర కార్యదర్శిగా కాట్రపల్లి గ్రామానికి చెందిన రావుల రాజేశ్‌ను నియమిస్తూ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కని సంజయ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు అందించారు. అనంతరం సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, బీసీలు అన్ని రంగాల్లో రాణించాలన్న ఉద్దేశంతో కమిటీల నియామకం జరిగిందన్నారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుడికాల భాస్కర్, జిల్లా కన్వీనర్ చిలుకమారి శ్రీనివాస్, హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు పంజాల తిరుపతిగౌడ్, మండల అధ్యక్షుడు పెరమండ్ల కోటేశ్వర్, భాస్కర్, రమేశ్, తాడూరి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎస్ అధికారిని కలిసిన వ్యాపారులు



శుభాకాంక్షలు తెలుపుతున్న వ్యాపారులు

జమ్మికుంట: జార్ఖండ్ రాష్ట్రంలోని డుంక జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న దొడ్డె ఆంజేయులు స్వగ్రామం అబాది జమ్మికుంట రాగా శనివారం స్థానిక వ్యాపారులు మర్యాదపూర్వకంగా కలిశారు. రైస్ మిల్లర్ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు బచ్చు భాస్కర్, వ్యాపారి జడల భాస్కర్ తదితరులు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

క్రమశిక్షణతో వాహనాలు నడపాలి



డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎంవీఐ వేణు

హుజూరాబాద్: ప్రతీ వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని హుజూరాబాద్ ఎంవీఐ వేణు సూచించారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా పర్కాల్ క్రాస్ రోడ్డు వద్ద మినీ వ్యాన్ అసోసియేషన్ ప్రాంగణంలో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రమశిక్షణతో వాహనాలను నడుపాలన్నారు. డ్రైవర్లు మద్యం సేవించరాదని, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. వాహనానికి సంబంధించిన ప్రతీ డాక్యుమెంట్ ఉండాలన్నారు. కానిస్టేబుల్ నాగరాజు తదితరులు ఉన్నారు.

కేసీఆర్ ఎదుట పోరాటం చేయాలి

కరీంనగర్ కార్పొరేషన్: స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్‌ను 33 శాతం నుంచి 23 శాతానికి తగ్గించిన తన తండ్రి కేసీఆర్ ఎదుట కవిత పోరాటం చేయాలని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు ప్రకటనలో అన్నారు. బీసీల పేరిట కవిత మరో నాటకానికి తెరలేపారని పేర్కొన్నారు. సీఎంగా కేసీఆర్ బీసీల రిజర్వేషన్‌ను తగ్గించినప్పుడు కవిత ఎందుకు ప్రశ్నించలేదన్నారు. ఇప్పుడు మళ్లీ కొత్తగా బీసీల పేరిట కపట నాటకానికి తెరతీయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి



సమ్మెలో పాల్గొన్న కార్మికులు

హుజూరాబాద్: న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పట్టణంలోని కార్యాలయం ఎదుట సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎండీ అజ్జు మాట్లాడుతూ, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పర్మినెంట్ చేయాలని పేర్కొన్నారు. ఇన్సూరెన్స్ సౌకర్యం తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. తమ సమస్యల సాధనకు ఈ నెల 6న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల ముట్టడి కార్యక్రమం నిర్వహించ తలపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సరోజన, కోశాధికారి రాజేశ్వరి, కార్యవర్గ సభ్యులు సులోచన, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

చొప్పదండి: పట్టణంలో అభివృద్ధి పనులకు రూ.56.50 లక్షల నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి శనివారం పట్టణంలోని మార్కెట్ చౌరస్తాలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, కొట్టె అశోక్, ముద్దం తిరుపతిగౌడ్, గుర్రం రాజేందర్‌రెడ్డి, వల్లాల కృష్ణహరి, మునిగాల సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గణిత పోటీలు

చొప్పదండి: మండలంలోని రాగంపేటలో శనివారం విద్యార్థులకు నలుమాచు లింగయ్య స్మారక గణిత పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. ట్రస్టు నిర్వాహకులు హరిప్రసాద్, ఎస్.సుదర్శనం, ఇన్‌చార్జి హెచ్ఎం గంగేశం, టి.వెంకన్న, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో శనివారం కారు– మోటార్‌సైకిల్ ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. తాడికల్‌కు చెందిన తాళ్ల దేవేందర్ కేశవపట్నం నుంచి గ్రామానికి వస్తుండగా హుజూరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో దేవేందర్‌కు తీవ్రగాయాలు కాగా స్థానికులు 108కు సమాచారం అందించారు. ఈఎంటీ సతీశ్‌రెడ్డి ప్రథమ చికిత్స చేసి కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రాగి వైరు చోరీ

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ శివారులో గల మెగా ఇంజినీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో దొంగలు రూ. 21.54 లక్షల విలువైన రాగి వైరు, రాగి బస్‌బార్లు చోరీ చేసినట్లు ఎస్సై అనూష తెలిపారు. కంపెనీ ఎలక్ట్రో మెకానిక్ ఇంజినీర్ గోపాల్ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

కేసు నమోదు

జమ్మికుంట: అకారణంగా దూషణలకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రవి శనివారం తెలిపారు. మండలంలోని పెద్దంపల్లి గ్రామానికి చెందిన కొమ్ము కొమురయ్య పొలం వద్ద ఉండగా, పక్క పొలానికి చెందిన పైండ్ల మోహన్‌రెడ్డి అకారణంగా బూతులు తిట్టి, దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అపార్ కార్డు జనరేట్ చేయాలి

చొప్పదండి: మండలంలోని పాఠశాలల్లో విద్యార్థుల అపార్ కార్డు జనరేటర్‌ను వెంటనే పూర్తి చేయాలని ఎంఈవో దీక్షితుల శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రంలో శనివారం హెచ్ఎంలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థి యొక్క అర్హతల సర్టిఫికెట్లు పోగొట్టుకున్నా ఆటోమేటిక్‌గా డౌన్లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ఈ విషయాన్ని హెచ్ఎంలు ప్రాధాన్యతగా తీసుకోవాలని కోరారు.

ముగ్గుల పోటీలు

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఐదుగురిని విజేతలుగా ఎంపిక చేసి బహుమతులు అందించారు. పంచాయతీ కార్యదర్శి సుమంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయప్రద తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం

శంకరపట్నం: కరాటేతో విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల హెచ్ఎం నీరజ పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థినులకు కరాటే మాస్టర్ శ్రీధర్ శిక్షణ ఇచ్చారు.

చెక్కులు అందజేత

హుజూరాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం తొమ్మిది మంది లబ్ధిదారులకు సుమారు రూ.10లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అందజేశారు.



శంకరపట్నం: మండలంలోని అర్కండ్ల గ్రామంలో పంటపొలాలకు వెళ్లే దారిలో ఓ వ్యక్తి సీసీ రోడ్డుపై కొంతమేర బండరాళ్లు వేశాడు. పొలాలు దున్నేందుకు ట్రాక్టర్లు వెళ్లకుండా సీసీరోడ్డుపై బండరాళ్లు వేశారని, వాటిని తొలగించాలని రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజు, పంచాయతీ కార్యదర్శి, సెల్ నంబర్ : 99494 25937

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ఆధునిక విజ్ఞానంతో జీవనశైలిలో మార్పులు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు, తదితరులు

హుజూరాబాద్: ఆధునిక సాంకేతిక విజ్ఞానంతో మానవ జీవనశైలిలో అనేక మార్పులు వస్తాయని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని సింగాపురం కిట్స్ కళాశాలలో డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ అధ్యక్షతన జరిగిన రెండు రోజుల సెమినార్ ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే కాలంలో రోబోటిక్ టెక్నాలజీని విరివిగా వాడుతారని పేర్కొన్నారు. ప్రతీ పనిని ఆధునిక పరిజ్ఞానం గల పరికరాలతో సులభంగా చేస్తారని వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లర్నింగ్, కంప్యూటర్ సైన్స్ పరిజ్ఞానాన్ని నేర్చుకోవాలని విద్యార్థులకు ఉపదేశించారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ, నూతన విజ్ఞానంతో విద్యార్థులు ప్రాజెక్టులు చేయాలని, అందుకు కళాశాల సహకరిస్తుందని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లర్నింగ్ విభాగాధిపతి, డీన్ డాక్టర్ కె.ప్రవీణ్‌కుమార్‌రావు మాట్లాడుతూ, రెండు రోజుల సెమినార్‌లో దాదాపు 100 మంది విద్యార్థులు శిక్షణ పొందారని తెలిపారు. అధ్యాపక సమన్వయకర్తలు ఎం.సుభద్ర, డి.రవి, ఆర్.రాజశేఖర్, సహ సమన్వయకర్తలు జి.రాధిక, పి.రేఖ, ఆర్.పద్మ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ కార్యక్రమాలకు సంఘటితంగా హాజరుకావాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

తిమ్మాపూర్: టీఎన్జీవో ఆధ్వర్యంలో రూపొందించిన 2025 క్యాలెండర్‌ను శనివారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల ఎస్ఈ కార్యాలయంలో తిమ్మాపూర్, గన్నేరువరం యూనిట్ అధ్యక్షుడు పోలు కిషన్‌తో కలిసి ఈఎన్సీ శంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భవిష్యత్‌లో సంఘాలు కార్యాచరణ ప్రకటిస్తే అందరూ సంఘటితంగా హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఈఎన్సీ వెంకటేశ్వర్లు, కార్యదర్శి అంబటి నాగరాజు, కోశాధికారి పుప్పాల అశోక్‌రెడ్డి, ఎస్ఈలు సుమతి, రమేశ్, సుధాకర్‌రెడ్డి, నరసింహారావు, వొంటెల రవీందర్‌రెడ్డి, రమేశ్, ప్రసాద్‌రెడ్డి, రాజయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

చిగురుమామిడి: బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మంకు శ్రీనివాస్‌రెడ్డి అకాల మరణం పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని నవాబుపేటలో శ్రీనివాస్‌రెడ్డి గుండెపోటుతో మృతిచెందిన, శనివారం ఆయన భౌతికకాయంపై బీఆర్ఎస్ కండువాకప్పి నివాళి అర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, మాజీ ఎంపీపీ కొత్త వినీతశ్రీనివాస్‌రెడ్డి, విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, భేతి రాజిరెడ్డి, సాంబారి కొమురయ్య, పెనుకుల తిరుపతి, తాడికొండ సందీప్‌రెడ్డి, సత్యనారాయణ, బోయిని మనోజ్‌కుమార్, సంపత్‌రెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



పరామర్శిస్తున్న వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి: బాధిత కుటుంబాలకు సీపీఐ అండగా ఉంటుందని ఆపార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం మండలంలోని చిన్నముల్కనూర్, ఇందుర్తి, చిగురుమామిడి గ్రామాల్లో వంగపెల్లి అయిలమ్మ, బింగి రాజయ్య, మాజీ సర్పంచ్ పులి వీరమ్మ, జిల్లేల్ల పోచయ్య కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న రసమయి బాలకిషన్ తదితరులు

మానకొండూర్: మండలంలోని వన్నారం మాజీ సర్పంచ్ పోలాడి రామారావు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శనివారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచ్ రామంచ గోపాల్‌రెడ్డి, జనగామ దేవేందర్‌రావు తదితరులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

కొత్తపల్లి: ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్, మెడికల్ తదితర బిల్లులను ప్రభుత్వం మంజూరు చేయాలని డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి దామోదర్ కోరారు. శనివారం కొత్తపల్లి జెడ్పీఉన్నత పాఠశాలలో 2025 క్యాలెండర్‌ను ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు.